క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 179 మందికి గాను 173 మంది హాజరవ్వగా ఆరుగురు ఆబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్‌ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 181 మందికి 178 మంది హాజరయ్యారని, ముగ్గురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 360 మందికి గాను 351 మంది హాజరయ్యారని, తొమ్మిది మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

ఘనంగా దత్త పీఠాధిపతి పుట్టినరోజు వేడుక



నాగాయలంక: దత్త హ్యూమన్ సర్వీసు వలంటీర్లు, మండల దత్త భక్త బృందం ఆధ్వర్యంలో షేర్ యువర్ ఫుడ్, అన్నసేవ- సచ్చిదానందసేవ కార్యక్రమం పేరుతో నాగాయలంక ప్రధాన కూడలిలో సోమవారం బాట సారులకు పులిహోర, స్వీట్స్ పంపిణీ చేశారు. మైసూరు దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ 83వ జన్మదినోత్సవం పురస్కరించుకుని స్థానిక దత్త మెడికల్స్ అధినేత చిట్టా వెంకట శేఖర్ ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమం జరిపారు. తొలుత దత్త సేవకులు ప్రార్థన జరిపి కార్యక్రమం ప్రారంభించారు. చిట్టా రామలింగేశ్వరరావు, శనగపల్లి వెంకట్రావు, చుండూరు సత్యనారాయణ, పాన్నూరు సురేష్, చిట్టా వాణి, పాన్నూరు దిలీప్, దత్త భక్తులు వలంటీర్లు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని పోర్టురోడ్డులో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన విద్యార్థులకు చిత్రలేఖనం, రంగోలి పోటీలు నిర్వహించారు. యోగాసనాలు నేర్పించారు. తొలుత సరస్వతి పూజ చేశారు. బాలల కథల పుస్తకాలు చదివారు. చెస్, క్యారమ్‌బోర్డు, లూడో వంటి ఆటలు ఆడారు. ఈ కార్యక్రమాన్ని ఉప గ్రథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

ఎయిడ్స్ నియంత్రణపై ఆకట్టుకున్న నాటిక



పెడన: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో గుడివాడకు చెందిన ఎం.శేఖర్ బాబు అండ్ పార్టీ ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటికను ప్రదర్శించారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డు ఇందిరా కాలనీలో ప్రదర్శించిన ఈ నాటిక స్థానికులను ఆకట్టుకుంది. ప్రజలకు హెచ్ఐవీ నియంత్రణకు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఐసీటీసీ సెంటర్లు, ఏఆర్టీ మందులు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, రక్తదానం తదితర విషయాలపై ఈ నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవైఎస్ఎస్ ఎన్జీవో ప్రతినిధి పీఎం.ప్రశాంతి, స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన

ఘంటసాల: పంటసాగు హక్కు పత్రాలపై వీఆర్వో, వీఏఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రసాద్ పంటసాగు హక్కు పత్రాల విషయంలో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. 1,244 మంది రైతులు ఆధార్‌లను సవరించుకోవాల్సి ఉందని చెప్పారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళీ కృష్ణ, డీటీ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



ఘంటసాల- అంబేద్కర్ నగర్ ప్రధాన రహదారి



ఘంటసాల - అంబేద్కర్ నగర్ ప్రధాన రహదారిలో వాహన చోదకుల ఫీట్లు

- నీటి కుంటలను తలపిస్తున్న ఘంటసాల- అంబేద్కర్ నగర్ రహదారి
- చిన్నపాటి వర్షానికే జలమయం
- మట్టితోలకాలతో మరింతగా పెరిగిన గుంతలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఘంటసాల: గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను కూడా అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఘంటసాల-అంబేడ్కర్ నగర్ పరిధిలో రోడ్లు, కుళాయిల దుస్థితిని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.

ఘంటసాల- అంబేద్కర్ నగర్ రోడ్డు..

గత కొన్ని రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ఘంటసాల నుంచి అంబేద్కర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి నీటి కుంటలను తలపిస్తోంది. దీంతో ఆరోడ్డులో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల మయంగా ఉన్న రోడ్డు ఇటీవల మట్టిలోడుతో భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు మరింత కుంగి భారీ గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మూడు ప్రాంతాలకు ఇదే మార్గం..

నిత్యం ఈ రోడ్డు మీదగానే అంబేడ్కర్ నగర్, మల్లంపల్లి, బోళ్లపాడు, మూడు పల్లెలకు వెళ్లే ప్రజలంతా ప్రయాణిస్తుంటారు. మోకాళ్ల లోతు నీరు నిలిచిపోవడంతో సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో పాటు మహిళలు నీటిలో ప్రయాణించేందుకు యాతనపడుతున్నారు. రోజుల తరబడి వర్షపు నీరు గుంతల్లోనే నిలిచిపోవడంతో వాహనదారులు భయం భయంతో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికై ఎదురు చూస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో..

అత్యవసర పరిస్థితుల్లో ఆటోల్లో, ఇతర వాహనాల్లో వెళ్లేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో మాబాధలు ఎవరికి పట్టవా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందించాలని వినతి..

అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి కనీసం గుంతల్లో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేసి ఉపశమనం కలిగించాలని, రోడ్డు కూడా త్వరగా నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని వేడుకుంటున్నారు.

నీటి కుళాయి ఇలా- నీరు పట్టుకునేదేలా?



ఘంటసాల: ఘంటసాల నుంచి అంబేద్కర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన చింతచెట్టు వద్ద ఘంటసాల పంచాయతీ ఏర్పాటు చేసిన నీటి కుళాయి చాలా కిందకు ఉండటంతో బిందెతో నీరు పట్టుకునేందుకు అవకాశం లేకపోయింది. చిన్న చెంబులు, వంట పాత్రలతో నీరు పట్టి బిందెల్లో నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నోసార్లు ఈ సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కుళాయి వద్ద నీరు పట్టుకునే మహిళలు ఆరోపిస్తున్నారు. నీరు కూడా కొద్ది సమయమే వదులుతున్నారని, చిన్న చిన్న పాత్రలతో నింపుకునే సరికి అరకొర నీటితో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఆదివారం సాయంత్రం కుళాయిలో మురికి నీరు రాగా, కొద్దిసేపు తర్వాత రంగమారిన నీరు వచ్చింది. వర్షాలతో కుళాయి చుట్టూ బురదమయంగా మారడంతో పాటు చెత్తాచెదారం చేరి మురికి నీరు రావడంతో ఎలాంటి అనారోగ్యాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బురద, చెత్త చెదారంతో అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న నీటి కుళాయి ఎత్తు పెంచి, చుట్టూ పరిశుభ్రం చేసి సిమెంటు వరతో కాంక్రీటు చేయించాలని కోరుతున్నారు.

వ్యవసాయ డిప్లమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయం అఫిలియేషన్‌లోని ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ అనుబంధ సంస్థ ఐన ఏజేకే అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ అగ్రికల్చర్ (3 సంవత్సరముల కోర్సు)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పీజే కుటుంబరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష అవసరం లేకుండానే ఈ కోర్సులో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. తమ కళాశాలలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుతో అత్యధిక ఉద్యోగ అవకాలు ఉన్నందున విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ నెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో (www.anf-rau.a-c.in) విశ్వ విద్యాలయ వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో సంప్రదిస్తే కళాశాలలోనే వారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు నింపేందుకు సాయం చేస్తారని తెలిపారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు 79956 76041, 90325 70039, 99490 66099, 92482 55355 సెల్ నంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

పశువులకు ముందస్తు టీకాలు

నందివాడ: పశువులకు వర్షాకాలంలో దొమ్మ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున పశుసంవర్ధక శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. నందివాడ మండలంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఆ వ్యాధి నివారణ టీకా మందును సిద్ధంగా ఉన్నట్టు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లతశ్రీ తెలిపారు. ఒక పశువుకు ఒక టీకా (డోసు) మందు వేస్తామన్నారు. పశువులకు ఈ టీకాలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ వెటర్నరీ అధికారి మూర్తి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా అమలేశ్వరి దేవి ఉత్సవాలు

పెడన: మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాలు సోమవారంతో ఐదో రోజుకు చేరాయి. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. 11 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 11 రోజులు పాటు అమ్మవారిని రోజుకొక విధంగా అలంకరిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుని చలి నైవేద్యం సమర్పించారు. తాము అనుకున్న కోర్కెలు తీర్చినందుకు కొందరు పురుషులు చీరకట్టుకుని, మరికొందరు చిన్నారులు విచిత్ర వేషధారణలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి కొందరు మొక్కుబడులు తీర్చుకునేందుకు మేళతాళాలతో ఊరేగింపుగా బయల్దేరి పసుపు, గులాంలు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.



అమలేశ్వరి దేవి ఆలయం ముందు ఊరేగింపులో నృత్యం చేస్తున్న భక్తులు

పిల్లాడ్ని కొట్టాడని.. ఆటోకు నిప్పు పెట్టిన తండ్రి

పెడన: రాజేష్, శ్యామలరావు పట్టణంలోని వీరభద్రపురంలో నివాసం. శ్యామలరావు ద్విచక్ర వాహనం రోడ్డుకు అడ్డంగా ఉందని రాజేష్ కుమారుడు శ్యామలరావు తల్లిని ప్రశ్నించాడు. రాజేష్ కుమారుడిని శ్యామలరావు ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో ముఖం వాచిపోయిందని తెలుస్తోంది. శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనను పురస్కరించుకుని రాజేష్ ఆదివారం రాత్రి శ్యామలరావు ఆటోకు నిప్పు పెట్టాడు. స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. ఆటో పైకప్పుతో పాటు డ్రైవర్ సీటు దెబ్బతిన్నాయి. అయితే ఈ విషయమై స్థానికులు ఇచ్చిన సమాచారంతో పెడన పోలీసులు విచారణ చేపట్టారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.



వీరభద్రపురంలోని ఆటోకు నిప్పు పెట్టడంతో దెబ్బతిన్న ఆటో

నేటి నుంచి యోగాంధ్ర ట్రైనీలకు శిక్షణ

పెడన: పట్టణంతో పాటు మండలంలోని యోగా ట్రైనీలకు మండల స్థాయిలో శిక్షణ ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఉంటుందని ఎంపీడీవో ఎ.అరుణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం పెడన మార్కెట్ యార్డు ఆవరణలో 27న ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. తొమ్మిది గంటల వరకు జరిగే ఈ యోగా శిక్షణ తరగతులకు మండలంలో ట్రైనీలు 153 మంది, పట్టణంలో 70 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు శిక్షణ తీసుకుని వీరు వారి వారి ప్రాంతాల్లో యోగా క్లాస్‌లు తీసుకుంటారని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనీలు ఈ ఐదు రోజుల పాటు రెండు గంటల సేపు శిక్షణ ఇస్తారని, మండల స్థాయిలో జరిగే ట్రైనీ క్లాసులకు తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఇతర మండల స్థాయి అధికారులు హాజరవుతారని ఆమె తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మోపిదేవి/అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ జన్మదిన వేడుకలు మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మోపిదేవి ప్రధాన సెంటర్‌లో తొలుత కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ పర్యవేక్షణలో కూటమి నాయకులు మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షులు సనకా ప్రశాంత్, మండల ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతా రామాంజ నేయులు, కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అవనిగడ్డ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ గొరుముచ్చు ఉమా చేతుల మీదుగా వస్త్రాలను అందించారు. జనసేన నాయకులు అన్నపరెడ్డి రాందాస్ ఆర్థిక సహాయంతో కార్యక్రమంజరిగింది.

టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎస్‌పీకేఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లమో కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్ ఓఎస్‌డీ ఎస్.గిరిధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది జూలై 1వ తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 15 నుంచి 23 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. ఎస్సీ కేటగిరీల వారికి 25 సంవత్సరాల వరకు ఉండాలన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లో 53 సీట్లు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్ణాటకలోని గడగ్‌లో నాలుగు సీట్లు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ ఎంపీసీ కోర్సులో ఉత్తీర్ణులైనవారు నేరుగా డిప్లమా రెండో సంవత్సరంలో చేరవచ్చన్నారు.08625- 295003, 93999 36872 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

నాగాయలంక: విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాగాయలంకలో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన, నిర్ధారణ శిబిరంతో 60 మంది మహిళలకు ఉచిత పరీక్షలు జరిపారు. సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ నేతృత్వంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగిన ఈ శిబిరాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు ప్రారంభించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌తో వచ్చిన మణిపాల్ ఆసుపత్రి టెక్నికల్ నిపుణులు రొమ్ము క్యాన్సర్ పరీక్ష, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితం చేసారు.



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

రెడ్‌క్రాస్ శిబిరంలో 47 మంది రక్తదానం

ఇదే ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్‌బ్రాంచ్ చైర్మన్ శివవిష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని స్థానిక ఎస్ఐ కలిదిండి రాజేష్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. 28వ సారి రక్తదానం చేసిన లేబాక కొండలు, వైజాగ్‌కు చెందిన ప్రొఫెసర్ తలశిల లక్ష్మి లను ఈ సందర్భంగా సన్మానించారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి భవిరి శంకరనాథ్, ట్రెజరర్ కొండపల్లి బాలజీ, లేబాక నాగేశ్వరరావు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకోవాలి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంక్ అకౌంటును అనుసంధానం, ఎన్‌పీసీఐ లింకేజ్ చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని పోస్టల్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్టు మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించదలచిన సంక్షేమ పథకాలు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే మన రాష్ట్రంలో సుమారు 51 లక్షల మందికి వారి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా గత సంవత్సరంలోనే జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ, పోస్టల్ శాఖ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించినట్లు చెప్పారు. ఇంకా లబ్ధిదారుల్లో చాలా మందికి ఆధార్ అనుసంధానం కానీ కారణంగా పోస్టల్ శాఖను సచివాలయ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీ నుంచి అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయడం ద్వారా సంక్షేమ పథకాల ఫలితాలు ఇబ్బందులేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. అందువల్ల ఆధార్ సీడింగ్ కాని వారు వెంటనే తమ దగ్గరలోని పోస్టు ఆఫీసును సంప్రదించాలని కోరారు.

ఈ వంతెనపై ప్రయాణమంటే వణుకే!

గూడూరు: మండల పరిధిలోని ముక్కొల్లు- నాగవరం గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలు సాగించే వంతెన శిథిలావస్థకు చేరి ప్రజలను వణికిస్తోంది. కొంకేపూడి కాలువపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కూలే పరిస్థితిలో ఉంది. రెండు ఖానాలుగా ఉన్న వంతెనలో ఒక ఖానా స్లాబ్ పూర్తిగా దెబ్బతింది. దీంతో స్థానికులు మట్టిపోసి వాహనాలు దిగబడకుండా బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

ఒక ఖానా నుంచే నీరు..

ఫలితంగా కాలువ ఆయకట్టు పరిధిలోని పంటపొలాలకు రెండు ఖానాల్లో నుంచి సాగాల్సిన సాగు నీరు ఒక ఖానా నుంచే పారుతుంది. వ్యవసాయ అవసరాల కోసం నిత్యం ట్రాక్టర్లు, ధాన్యం లారీలు తిరుగుతుంటాయి. అలాంటి పరిస్థితిలో వంతెన కూలిపోతే రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెనక్కు మళ్లిన నిధులు

గతంలో వంతెన నిర్మాణంతో పాటుగా ముక్కొల్లు నుంచి నాగవరం వెళ్లేందుకు ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకంలో నిధులు మంజూరు అయ్యాయి. వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు, రోడ్డు నిర్మాణానికి రూ.2.2కోట్లు మంజూరయ్యాయి. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శించడంతో మంజూరైన నిధులు వెనక్కువెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో వంతెన నిర్మాణం, రోడ్డు సమస్య రెండూ అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి కూలిపోయే పరిస్థితిలో ఉన్న ముక్కొల్లు- నాగవరం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ముక్కొల్లు- నాగారం వంతెన

రిజిస్ట్రేషన్ ఇలాకాలో ఇదేంవింత?

బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వ ధర అధికం

పెడన: పెడన సబ్‌రిజిస్ట్రార్ ఇలాకాలో వింతలు చోటుచేసుకున్నాయి. భూములకు ఎక్కడైనా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే బయట జరిగే మార్కెట్ ధర అధికంగా ఉండటం సహజం. కానీ పెడన సబ్‌రిజిస్ట్రార్ ఇలాకాలో ప్రభుత్వ ధర ఎక్కువగా బయట మార్కెట్ ధర ఎన్నో రెట్లు తక్కువగా ఉంది.



సర్వే నంబరు 37లో రెండు ఎకరాలు విక్రయించాలనుకుంటున్న పంట పొలం

మితిమీరిన వ్యత్యాసం..

రైతు వారి ధరలు ఎకరా భూమి రూ.23 లక్షల నుంచి రూ.30 లక్షలు పలుకుతోంది. అయితే వీటికి ప్రభుత్వం నిర్ణయించిన విలువ రూ.38 లక్షల నుంచి రూ.1.12 కోట్ల వరకు ఉండటం విశేషం. దీంతో అమ్మకం దారులు ముందుకు వస్తున్నా కొనుగోలు దారులు రిజిస్ట్రేషన్ చార్జీలు చూసి వెనుదిరుగుతున్న సంఘటనలు అధికమయ్యాయి. దీంతో అమ్మకం దారులు లబోదిబో అంటున్నారు.

సర్వే నంబరు 37లో పంట పొలాల దుస్థితి..

సర్వే నంబరు 37లో పంట పొలాలను గత 10 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వరకు ఎవరూ క్రయవిక్రయాలు జరపలేదు. ఇటీవల ఒక రైతు అప్పులపాలు కావడంతో తనకు ఉన్న మూడు ఎకరాల పొలంలో రెండు ఎకరాలు అమ్మితే తన అప్పులు తీరుతాయని, ఒక ఎకరం తనకు ఉంటుందని భావించి బేరం పెట్టాడు. అక్కాచెల్లెలు ఇరువురు ఒక్కొక్క ఎకరం చొప్పున రెండు ఎకరాలను కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చారు. ఎకరం రూ.22 లక్షలకు బేరం కుదిరింది. అడ్వాన్సుగా రూ.2 లక్షలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి మంచి ముహూర్తం చూసి డాక్యుమెంట్లు తయారు చేయించారు. వీటి పక్కనే ఉన్న పంట పొలాల మార్కెట్ విలువ రూ.38 లక్షల ప్రకారం ఈ సర్వేకు లెక్క కట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు సేల్ డీడీగా 7.5 శాతం అంటే రూ.2.86 లక్షలు చెల్లించడానికి సిద్ధమై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు సమర్పించారు.


సమస్య ఇలా..

ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. సర్వే నంబరు 37, 37 సబ్ డివిజన్‌లో ఉన్న 13 ఎకరాలు ప్రభుత్వ మార్కెట్ విలువ ఎకరం రూ.1.12 కోట్లుగా ఉందని, రిజిస్ట్రేషన్ చార్జీలు ఎకరానికి రూ.8.40 లక్షలు అవుతుందని పేర్కొన్నారు. రెండు ఎకరాలను రూ.2.24 కోట్లకు కొనుగోలు చేసినట్లుగా చూపించడమే కాకుండా రిజిస్ట్రేషన్ చార్జీలు రూ.16.80 లక్షలు చెల్లించాలని చెప్పారు. దీంతో కొనుగోలుదారులు అడ్వాన్స్ తిరిగి ఇచ్చేయాలంటూ మధ్యవర్తులపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితి.

ఇదొక్కటే కాదు..

పెడన సబ్‌రిజిస్ట్రార్ ఇలాకాలో ఇదొకటే కాదని తెలుస్తోంది. ఇలాంటి సర్వే నంబర్లు చాలా ఉన్నాయనే వాదనలు రైతుల నుంచి వినిపిస్తోంది. అధికారులు ఇలా ఎందుకు చేస్తున్నారో ఎవరికీ అర్థం కావటం లేదు.


దీనిపై ఎవరిని కలవాలో..



నాకు పెడన సబ్ రిజిస్ట్రార్ పరిధిలో పెడన శివారులో గూడూరు మండల సరిహద్దులో మురుగుకాలువ సమీపంలో మూడు ఎకరాలుంది. నా పొలం చుట్టూ నిర్మాణాలు లేవు. రెండెకరాలు అమ్మేద్దామనుకున్నా. కొందామని వచ్చిన వారు రిజిస్ట్రేషన్ చార్జీలు చూసి వెనక్కు వెళ్లిపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేసి ఆదుకోవాలి.

– సింగనపూడి గంగాప్రసాద్, రైతు, మచిలీపట్నం

రెండు శాతం మాత్రమే పెంచాం..



సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలను చేపట్టక ముందు ఏ విధంగా ధరలు ఉన్నాయో, వాటి ప్రకారమే 2 శాతం మాత్రమే పెంచాం. రూ.2 లక్షలు మించి పెరగలేదు. నేను రాక ముందు నిర్ణయించిన ధరలు. వాటి ప్రకారమే రిజిస్ట్రేషన్ చార్జీలు కట్టించుకుంటున్నాం. ప్రభుత్వ మార్కెట్ విలువ తగ్గించే విషయం మా చేతుల్లో ఉండదు.

– ఎం.వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్, పెడన

పెనమలూరు: హత్యాయత్నంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకట రమ ణ కథనం.. శ్రీకాకుళం జిల్లా బద్రికి చెందిన శ్రీనివాసరావు యనమలకుదురులో ఉంటూ విజయవాడలో బంగారం పనులు చేసాడు. శ్రీనివాసరావు బంధువు జానకిరామ్ ఇటీవల శ్రీనివాసరావు భార్య ఫొటోలు ఫోన్‌లో పలువురికి పంగా శ్రీనివాసరావు, భార్య మందలించారు. ఆదివారం జానకిరామ్ రాడ్‌తో శ్రీనివాసరావుపై దాడి చేశాడని కేసునమోదైంది.